ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
ఆదివారం 24 నవంబరు 2024



ప్రపంచ శాంతి వేదిక.. ప్రశాంతి నిలయం

- సత్యసాయి సేవలు ప్రపంచానికే ఆదర్శం
- గవర్నర్ అబ్దుల్‌నజీర్
- ఘనంగా సత్యసాయి జయంతి
- పాల్గొన్న దేశ, విదేశాల భక్తులు

(వివరాలు 6లో....)



కూలిన కుటుంబాలు

హైవేపై ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తలగాసిపల్లి వద్ద ఘోర ప్రమాదం

ఎనిమిది మంది మృతి..

ఆరుగురికి గాయాలు

అరటి తోటలో పనికి వచ్చి.. అనంత లోకాలకు..

మృతులు పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామస్థులు



అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో క్షతగాత్రుల కుటుంబ సభ్యులు (వివరాలు 7లో....)

మహా తీర్పు

కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను తిప్పికొట్టిన మహారాష్ట్ర ప్రజలు..

మంత్రి సత్యకుమార్‌యాదవ్



పుట్టపర్తి రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను మహారాష్ట్ర ప్రజలు తిప్పికొట్టారని, బీజేపీకి అఖండ విజయాన్ని అందించారని వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు డబ్బుసంచులతో వెళ్లినా ఆ రాష్ట్ర ప్రజలు ఆదరించలేదని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను వంచించారని అన్నారు. తెలంగాణలో ఫ్రీగ్యాస్ సిలిండర్ పంపిణీ చేస్తామని చెప్పిన హామీని ఇప్పటికీ అమలు చేయలేదని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి మొదలుకుని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఉత్తం కుమార్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి కట్టకట్టుకుని ప్రచారం చేసినా ఫలితం లేకపోయిందని అన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం ఎన్డీఏకే సాధ్యమని, ఏపీలో 16వేల టీచర్‌పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం, పించన్ పెంపు, మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు దీనికి ఉదాహరణ అని అన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు జీఎం శేఖర్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, లాయర్‌హరికృష్ణ, జ్యోతిప్రసాద్, బాలగంగాధర్, నారాయణ, సోకేరామాంజినేయులు, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రతిభ

మడకశిర రూరల్, నవంబరు 23:(ఆంధ్రజ్యోతి): ఇటీవల బాపట్లలో నిర్వహించిన క్రీడా పోటీల్లో మడకశిర వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచి బహుమతులు పొందినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినీ దేవి శనివారం తెలిపారు. డీన్ మాట్లాడుతూ విద్యార్థులు టెన్నికాయిట్, జావెలిన్ త్రో 400, రన్నింగ్, గ్రూప్ డ్యాన్స్, సోల్ డాన్స్ రంగోళి తదితర పోటీలలో గెలుపొంది బహుమతులు సాధించారని వెల్లడించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను కళాశాల ప్రొఫెసర్లు అభినందించారు.

వర్గపోరు

పురం వైసీపీలో కొనసాగుతున్న విభేదాలు



ఇన్‌చార్జిని మార్చాలంటూ మూడు వర్గాల పట్టు

సహకరించనివారిని సస్పెండ్ చేయాలంటున్న ఇన్‌చార్జ్ వర్గం

నేడు అభిప్రాయ సేకరణకు ముఖ్యనేతల రాక

హిందూపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆవిర్భవం నుంచి కూడా నియోజకవర్గంలో వర్గపోరు సాగుతూనే ఉంటుంది. పార్టీ ఇన్‌చార్జ్ ఎవరైనా సరే వారికి మూడు వర్గాలు వ్యతిరేకంగా పని చేయడం ఇక్కడ సర్వసాధారణం. స్థానిక నాయకుడు ఇన్‌చార్జ్‌గా ఉన్నా, స్థానికేతరులు ఉన్నా వర్గపోరు మాత్రం ఆగడం లేదు. ప్రస్తుతం ఆ పార్టీలో జరుగుతున్న పరిణామాలే ఇందుకు అద్దం పడుతున్నాయి.

ఆది నుంచి పోరే..

వైసీపీ ఆవిర్భావం తర్వాత నియోజకవర్గ మొదటి సమన్వయకర్తగా చౌళూరు రామకృష్ణారెడ్డికి అవకాశం ఇచ్చారు. అయితే ఆయన్ను కొండూరు వేణుగోపాల్‌రెడ్డి వ్యతిరేకించారు. వీరిద్దరిని వ్యతిరేకిస్తూ అప్పట్లో డా.మదన్‌మోహన్‌రెడ్డి మూడో వర్గంగా ఏర్పడ్డారు. 2014ఎన్నికలకు ముందు పై ముగ్గురిని కాదని నవీన్‌నిశ్చల్‌ను తీసుకుని టికెట్ ఇచ్చారు. అయితే అప్పుడు కూడా అతడికి మూడు వర్గాలు వ్యతిరేకంగా పనిచేశాయి. ఆయన 2019ఎన్నికల ముందు వరకు ఇన్‌చార్జ్‌గా ఉన్నాడు. అయితే అతన్ని కూడా పక్కనబెట్టి మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన వర్గపోరు పడలేక తాను ఎన్నికల్లో పోటీచేయనని అధిష్ఠానా నికి చెప్పడంతో ఎన్నికలకు కొద్దిరోజుల ముందు మాజీ ఐపీఎస్ అధికారి షేక్ మహ్మద్ ఇక్బాల్‌ను హిందూపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించారు. ఆయన బీఫారం తీసుకుని నియోజకవర్గంలోకి అడుగుపెట్టిన మొదటిరోజే కొడికొండ చెక్‌పోస్టువద్ద నవీన్‌నిశ్చల్‌కు ఇక్బాల్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. అది కాస్త వర్గపోరుగా మారి కొనసాగింది. దీంతో ఎన్నికల్లో ఇక్బాల్ ఓటమి పాలయ్యాడు. అయినా పురం వైసీపీ ఇన్‌చార్జ్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు. అయితే ఆయనకు వ్యతిరేకంగా నవీన్‌నిశ్చల్, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి వ్యతిరేకంగా పనిచేస్తూ వచ్చారు. కానీ చౌళూరు రామకృష్ణారెడ్డి ఎమ్మెల్సీతో కలిసి ఉన్నాడు. కొద్దిరోజుల తరువాత ఆయనతో విబేధించాడు. ఈ పరిస్థితుల్లో 2022 అక్టోబరులో చౌళూరు రామకృష్ణారెడ్డి దారుణహత్యకు గురయ్యాడు. దీనిని ఆసరాగా చేసుకుని అప్పట్లో నవీన్‌నిశ్చల్, కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, చౌళూరు రామకృష్ణారెడ్డి వర్గీయులు ఇక్బాల్‌ను వ్యతిరేకించారు. అయినా కొంత కాలం ఆయన్నే ఇన్‌చార్జ్‌గా కొనసాగించారు. 2023ఆగస్టు మాసంలో ఇక్బాల్‌నుకూడా తప్పించి బెంగళూరులో నివాసమున్న వేణురెడ్డి సతీమణి దీపికకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. మొదట అందరూ కలిసి ఉన్నట్లే కనిపించినా ఆ తరువాత ఎవరికి వారుగా నాలుగు వర్గాలుగా విడిపోయారు. 2024లో జరిగిన ఎన్నికల్లో దీపిక బరిలో దిగారు. అయితే ఆమె ఎన్నికల్లో ఓడిపోయారు. అయితేపై మూడు వర్గాలు తన గెలుపుకోసం పనిచేయలేదంటూ దీపిక వర్గీయులు అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఆమె పురం వైసీపీ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. అయితే ఆమెను తప్పించి వేరేవారికి ఇన్‌చార్జ్ పదవిని ఇవ్వాలని మిగిలిన నాయకులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో దీపికను మార్చాలంటూ మూడు వర్గాల నాయకులు గట్టిగా పట్టుబట్టినట్లు తెలుస్తోంది. స్థానిక నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండే నాయకుడికి బాధ్యతలు అప్పగించాలని ఒకరిద్దరు ముఖ్య నేతలు అధిష్ఠానానికి విన్నవించినట్లు సమాచారం.



ముఖ్య నేతను సస్పెండ్ చేయాలంటున్న ఇన్‌చార్జ్ వర్గం

ఇదిలా ఉండగా పార్టీలో ఓ ముఖ్యనేత మాకు మొదటి నుంచి సహకరించలేదంటూ ఎన్నికల సమయంలో కూడా పార్టీ గెలుపునకు ఏమాత్రం పనిచేయలేదంటూ ఇన్‌చార్జ్ వర్గీయులు మాజీ మంత్రి పెద్దిరెడ్డి వద్ద ఎన్నికల అనంతరం వాపోయినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఇటీవల పార్టీ ముఖ్యనేతలతో కలిసి విన్నవించినట్లు తెలిసింది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ముఖ్యనేతను బహిష్కరించడం సబబు కాదని పార్టీలోని ఓ నాయకుడు చెప్పినట్లు తెలిసింది. అయినా ఇన్‌చార్జ్ వర్గం అధిష్ఠానం వద్ద కొన్ని డిమాండ్లు పెట్టింది. ఇదే సమయంలో ఇన్‌చార్జ్‌ను తప్పించి నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేవారిని నియమించాలని కోరుతున్నారు. అయితే ఎవరు ఇన్‌చార్జ్‌గా ఉన్నా ఖర్చు వారే భరించుకోవాలని, అలాంటి వారికే ఇన్‌చార్జ్ పదవి అప్పగిస్తామని ఓ నాయకుడికి అధిష్ఠానం సూచించినట్లు సమాచారం.

నేడు అభిప్రాయ సేకరణకు ముఖ్యనేతల రాక

హిందూపురం నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడు ఇటీవల పార్టీ అధినేతను కలిసి ఇన్‌చార్జ్ పదవి గురించి ప్రస్తావించినప్పుడు సున్నితంగా మీరు వెళ్లి వ్యాపారాలు చేసుకోండి ఇంకొకరికి అవకాశం ఇస్తామని చెప్పినట్లు సమాచారం. కానీ మరో వర్గం వారు మాత్రం 'అధిష్ఠానం మనవైపే ఉంది. మనల్ని వ్యతిరేకించి పార్టీకి నష్టం కలిగించే వారిని బయటకు పంపడానికి సిద్ధంగా ఉన్నాం' అని సన్నిహితుల వద్ద చెప్పుకుంటున్నట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో ఆదివారం జిల్లా అధ్యక్షురాలితోపాటు మరో ఇద్దరు ముఖ్యనేతలు ఇన్‌చార్జ్ పదవిపై ఇక్కడ నెలకొన్న విభేదాల పరిష్కారంలో భాగంగా అభిప్రాయ సేకరణకు హిందూపురం వస్తున్నట్లు తెలిసింది. ఇన్‌చార్జ్‌గా ఉన్న దీపిక కార్యాలయంలో సమావేశం ఉంటుందని వారి వర్గీయులు తెలుపగా అందుకు రెండు వర్గాలు వ్యతిరేకించినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో ఎక్కడైనా వేరేచోట సమావేశం పెట్టాలని నిర్ణయించారు. ఏది ఏమైనా హిందూపురం నియోజకవర్గం వైసీపీలో మాత్రం వర్గపోరు చల్లారడం లేదు.

ఖాద్రీశా.. పాహిమాం

భక్తులతో కిటకిటలాడిన శ్రీవారి ఆలయం



స్వామివారి దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

కదిరి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం శనివారం సందర్భంగా పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనానికి భక్తులు ఉదయం నుంచే క్యూలో వేచి ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకోవడానికి శుక్రవారం రాత్రే ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి ధ్వంజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. భక్తుల రాకతో దేవాలయ పరిసరాలు సందడిగా మారాయి.

సత్యసాయి వేడుకల విజయవంతంపై ఎస్పీ హర్షం



పుట్టపర్తి రూరల్, నవంబరు 23 (ఆంధ్ర జ్యోతి): సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలను విజయవంతం చేయడంలో కీలకపాత్ర వహించిన పోలీసు యంత్రాంగం, వివిధశాఖలు, మీడియా ప్రతినిధులకు జిల్లా ఎస్పీ ధన్యవాదాలు తెలియచేశారు. జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రముఖుల పర్యటనలో ఎలాంటి భద్రతా లోపాలు లేకుండా విజయవంతం చేసిన పోలీసుశాఖకు ప్రత్యేక అభినందనలన్నారు. ప్రశాంతినిలయంలోని పలు కీలకప్రాంతాల్లో బందోబస్తు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. బందోబస్తులో లోటుపాట్లను ఎప్పటికప్పుడు తమదృష్టికి తెచ్చి సత్యసాయి జయంత్యుత్సవాలు విజయవంతం చేయడంలో మీడియాపాత్ర అమోఘమని ప్రత్యేకంగా అభినందించారు.

బర్త్ సర్టిఫికెట్ల కోసం డబ్బులివ్వాలా..?

సీపీఐ నాయకుల ఆగ్రహం... ధర్నా



సచివాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

బత్తలపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జనన ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి అధిక డబ్బు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ సీపీఐ నాయకులు శనివారం బత్తలపల్లి సచివాలయం ఎదుట బాధితులతో కలిసి ధర్నా నిర్వహించారు. బత్తలపల్లిలో ఆర్డీటీ ఆస్పత్రి ఉండటంతో ఇక్కడకు రాయలసీమలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రసవం కోసం వస్తుంటారు. ఇక్కడ పుట్టిన వారికి బత్తలపల్లి సచివాలయంలో బర్త్ సర్టిఫికెట్లు ఇస్తారు. అయితే ప్రస్తుతం ఎవరు డబ్బు ఎక్కువ ఇస్తే వారికి మాత్రమే సర్టిఫికెట్లు ఇస్తున్నారు. డబ్బులు ఇవ్వనివారిని నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. దీంతో విసిగిపోయిన పలువురు బాధితులు ఈ విషయాన్ని సీపీఐ నాయకుల దృష్టికి తీసుకువెళ్లారు. వారు వెళ్లి అడిగినా సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. దీంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తూ బాధితులతో కలిసి అక్కడే ధర్నాకు దిగారు. వారు మాట్లాడుతూ మండల అధికారుల నిర్లక్ష్యంతోనే సచివాలయ సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. బర్త్ సర్టిఫికెట్ల కోసం డబ్బులు ఇవ్వాలా అని ప్రశ్నించారు. ఎంపీడీఓ వచ్చి బాధితులకు న్యాయం చేయలని భీష్మించారు. పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామి వచ్చి ఇకమీదట అక్రమాలు జరగకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కాటమయ్య, రమణ, వెంకటేసు, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

పైలు కదలాలంటే.. పైసలివ్వాల్సిందే..!

- ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలో వింత పరిస్థితి
- వీఆర్‌ఓ లంచం డిమాండ్‌పై సోషల్‌మీడియాలో వైరల్
- గిరిధర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

పదోన్నతి జేఈఈఈలలో ఆందోళన

- పీఆర్‌లో అడహక్ ప్రమోషన్లపై ప్రభుత్వం ఆరా

వివరాలు 6లో...



సత్యసాయిబాబా మహాసమాధి

ప్రపంచ శాంతి వేదిక.. ప్రశాంతినిలయం



- సత్యసాయి సేవలు ప్రపంచానికే ఆదర్శం
- గవర్నర్ అబ్దుల్‌నజీర్
- ఘనంగా సత్యసాయి జయంతి
- పాల్గొన్న దేశ, విదేశాల భక్తులు

పుట్టపర్తి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సత్యసాయి అవతరించిన ప్రశాంతినిలయం ప్రపంచశాంతికి వేదికగా మారిందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ పేర్కొన్నారు. సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలు శనివారం ప్రశాంతినిలయంలోని సాయికుల్వంతులో కన్నుల పండువగా జరిగాయి. విద్యార్థుల గురువందనం భక్తిగీతాల ఆలపనతో జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ ప్రసంగిస్తూ సత్యసాయి తన ఆధ్యాత్మిక బోధనలు, సేవలు, ప్రేమతత్వంతో కోట్లాది మందికి ఆరాధ్యదైవమయ్యారని కొనియాడారు. సత్యసాయి అందిస్తున్న విద్య, వైద్యం, తాగునీరు వంటి సేవలు వెలకట్టలేనివన్నారు. వేలాది గ్రామాలకు స్వచ్ఛమైన



ఉత్సవాలకు హాజరైన భక్తులు



మహాసమాధిని దర్శించుకుంటున్న గవర్నర్



సత్యసాయి బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న ఆర్‌జే రత్నాకర్

తాగునీరు అందించడానికి సత్యసాయి వందల కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులను ఆదుకోవడానికి సత్యసాయి సేవా సంస్థలు ఎప్పుడు ముందుంటాయని పేర్కొన్నారు. పాఠశాలల్లో వేలాది మంది విద్యార్థులకు రాగి మాల్ట్ అందిస్తున్నట్లు తెలిపారు. మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారని కొనియాడారు. అనంతరం గవర్నర్ చేతులమీదుగా దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందజేశారు. ట్రస్టు ప్రతినిధులతో కలిసి ట్రస్టు వార్షిక నివేదికను విడుదల చేశారు.

సేవల ఖర్చు రూ.166 కోట్లు



సత్యసాయి బాబా చేపట్టిన సేవలను మరింత పారదర్శకంగా కొనసాగిస్తున్నామని, ఈ ఏడాది సేవల కోసం రూ.166 కోట్లు ఖర్చు చేసినట్లు ట్రస్టు సభ్యులు నాగానందం పేర్కొన్నారు. రూ.237 కోట్లు రాబడి ఉందన్నారు. వైద్యసేవలకు రూ.100 కోట్లు, క్యాపిటల్ ఖర్చు రూ.32కోట్లు, ఉచిత విద్యుత్‌కు రూ.15కోట్లు, అభివృద్ధి పనులకు రూ.20కోట్లు, ఇతర కార్యక్రమాలకు రూ.28కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. బెంగళూరు వైట్ ఫీల్డ్ ఆస్పత్రిలో 16500 ఉచిత శస్త్రచికిత్సలు, 2.30లక్షల మందికి పరీక్షలు, మొబైల్ ఆస్పత్రి ద్వారా 56వేల మందికి ఉచిత వైద్యసేవలు అందించినట్లు వివరించారు. ఇవేకాక కాకదేశ వ్యాప్తంగా సేవలను కొనసాగిస్తున్నామన్నారు.

ప్రధాని సందేశం

సత్యసాయి జయంతి వేడుకలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పంపించిన సందేశాన్ని ట్రస్టు సభ్యులు నాగానందం చదివి వినిపించారు. సత్య సాయిబాబా మానవతా మూర్తి అని, ఆయన సేవలు వెలకట్టలేనివని, ము ఖ్యంగా అతిఖరీదైన ఉచిత వైద్యాన్ని అందరికి అందిస్తుండటం ప్రశంసనీయంటూ ప్రధాని సందేశాన్ని చదివి వినిపించారు. ట్రస్టు సభ్యులు గవర్నర్‌కు, మంత్రికి, ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డికి మొక్కలు పంపిణీ చేశారు.

పాల్గొన్న వీఐపీలు

సత్యసాయి జయంతి వేడుకల్లో రాష్ట్రమంత్రి సవిత, ఎంపీ బీకే పార్థసారథి, మాజీ మంత్రులు పల్లె రఘునాథరెడ్డి, గీతారెడ్డి, ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, ఎంఎస్‌రాజు, ట్రస్టు సభ్యులు చక్రవర్తి, డాక్టర్ మోహన్, ప్రసాద్, రామసుబ్రహ్మణ్యం, కలెక్టర్ టీఎస్ చేతన్, అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ ఎస్పీ రత్న, ఏఎస్పీ శ్రీనివాసులు, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, ధర్మవరం ఆర్డీఓ మహేశ్, పుట్టపర్తి తహసీల్దార్ అనుపమ, బీజేపీ రాష్ట్ర నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జీఎంశేఖర్, సేవాసంస్థల ప్రతినిధులు నిమీష్‌పాండే, హీరా, కోటేశ్వరరావు, చలం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వడ్డే అంజినప్ప తదితరులు పాల్గొన్నారు.



సంగీత కచేరి నిర్వహిస్తున్న మల్లాది సోదరులు

సత్యసాయి సేవలు 139 దేశాలకు విస్తరణ: మంత్రి



సత్యసాయిబాబా తన సేవలను 139 దేశాలకు విస్తరించారంటూ రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ కొనియాడారు. 99 సంవత్సరాల కిందట సత్యనారాయణ అవతరించారని, ఆయనే సత్యసాయి బాబాగా తన 14వ ఏట అవతరణ ప్రకటన చేసి ఆధ్యాత్మిక బోధనల ద్వారా గురువుగా పూజలందుకుంటున్నారన్నారు. అంచెలంచెలుగా తన సేవలను ప్రపంచానికి విస్తరించారని పేర్కొన్నారు. నిస్వార్థసేవలకు సత్యసాయి ప్రతి రూపమని అందుకే నేడు ప్రపంచ వ్యాప్తంగా సత్యసాయికి లక్షలాది భక్తులు ఉన్నారన్నారు. 2020-25 సత్యసాయి స్వర్ణోత్సవాలు నిర్వహించడానికి ముందస్తు ప్రణాళిక చేయడం అభినందనీయమన్నారు. సత్యసాయి శివైక్యం తరువాత సేవలు యథావిధిగా సాగడం అంతా ట్రస్టు కృషేనన్నారు.

కన్నుల పండువగా స్వర్ణరథోత్సవం

ప్రశాంతి నిలయం వీధుల్లో స్వర్ణ రథోత్సవం కన్నుల పండువగా సాగింది. సాయంత్రం 5గంటలకు బంగారు రథంలో సత్యసాయి చిత్రపటాన్ని ఉంచి పూజలు చేశారు. అనంతరం భక్తిపాటలు పాడుతూ రథోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి సాయికుల్వంతులో లాలంబుడి కృష్ణబృందం సత్యసాయి జోలోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మల్లాది సోదరులు సంగీత గానంతో భక్తులను అలరించారు. సత్యసాయి జయంతి వేడుకలలో దేశవిదేశాలకు చెందిన వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

ఆధార్ అనుసంధానంలో ప్రథమ స్థానం

- డీపీఓ నాగరాజనాయుడు



అనంతపురం న్యూటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వినోద్‌కుమార్ సహకారంతోనే పంచాయతీల్లోని ప్రజల బ్యాంకు అకౌంట్లకు ఆధార్ అనుసంధానంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచామని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు పేర్కొన్నారు. శనివారం బ్యాంకు అకౌంట్ ఆధార్ అనుసంధానంపై గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్ జిల్లా పంచాయతీ అధికారులు, ఇతర అధికారులతో గుగూల్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇందులో వెనుక బడిన వారికి చురకలు అంటించారు. వేగవంతం చేసి గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. 96 శాతం పూర్తి చేసిన అనంతపురం డీపీఓ నాగరాజనాయుడుతో డైరెక్టర్ మాట్లాడారు. మిగిలిన జిల్లాల్లో ఎవరూ ఈ స్థాయిలో చేయలేకపోయారని, మీరు ఎలా చేశారని, పాటించిన అంశాలను వివరించాలని అడిగారు. దీనిపై డీపీఓ నాగరాజనాయుడు మాట్లాడుతూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలకు అనుగుణంగా సిబ్బందిని సచివాలయాల వారిగా అప్రమత్తం చేశామని తెలిపారు. సమస్యలు ఉన్న చోట తగిన సూచనలు చేశామన్నారు. కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎంపీడీఓల ద్వారా ఎప్పటికప్పుడు ఆరా తీసి సూచనలు ఇచ్చారని తెలిపారు.

లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయండి : జేడీ



మాట్లాడుతున్న జేడీ రామాంజనేయులు

అనంతపురం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీలకు ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు పేర్కొన్నారు. శనివారం అనంతపురం మార్కెటింగ్ శాఖ ఏడీ కార్యాలయంలో ఆయన ఉమ్మడి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీలు, యార్డుల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. మార్కెట్ కమిటీల వారిగా లక్ష్యాలు..పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యార్డుల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఆదాయ మార్గాలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రతి కమిటీలోను నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అనంతపురం మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణచౌదరి, సత్యసాయి జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ మూర్తి, ఉమ్మడి జిల్లా పరిధిలోని స్పెషల్ గ్రేడ్ కార్యదర్శులు, యార్డుల కార్యదర్శులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్

అనంతపురం క్రైం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. డిసెంబరు 14న అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల పరిధిలోని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మోటారు వాహనాల ప్రమాద భరిత కేసులు, సివిల్ కేసులు, చెక్ బౌన్సు కేసులు, కుటుంబ తగాదాలు (విడాకుల కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ చేయదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులను జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీ చేస్తామని పేర్కొన్నారు. సంబంధిత కక్షిదారులందరూ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జిల్లాకు వచ్చేసిన ఎంపీఈఓలు

అనంతపురం అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న ఎంపీఈఓలు ఎట్టకేలకు తిరిగి జిల్లాకు వచ్చేశారు. ఉమ్మడి జిల్లాలో 105 మంది ఎంపీఈఓలు తిరిగి రావాల్సి ఉంది. అనంతపురం జిల్లాకు 52 మంది రావాల్సి ఉండగా ఇప్పటి దాకా 36 మంది ఎంపీఈఓలు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో జాయినింగ్ రిపోర్టులు అందజేశారు. మిగిలిన సిబ్బంది చిత్తూరు జిల్లాలో నో డ్యూస్ సర్టిఫికెట్‌తోపాటు రిలీవింగ్ ఆర్డర్లు తీసుకొని మరో మూడు రోజుల్లో విధుల్లో చేరనున్నట్లు సమాచారం.

గ్యాస్ డెలివరీకి అధికంగా వసూలు చేయొద్దు : జేసీ

అనంతపురంటౌన్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): వంట గ్యాస్ డెలివరీకి అధికంగా డబ్బులు వసూలుచేస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టరు శివనారాయణశర్మ హెచ్చరించారు. ఆయన శనివారం రాత్రి డీఎస్‌ఓ వెంకటేశ్వర్లుతో కలిసి నగరంలో పర్యటించారు. వంట గ్యాస్ తీసుకున్న లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. జేసీ మాట్లాడుతూ... గ్యాస్ డెలివరీ చేసే బాయ్స్ అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అది నిజమైతే గ్యాస్‌ఏజెన్సీపై చర్యలు తీసుకోవడంతో పాటు, డెలివరీ బాయ్స్‌పై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బొలికొండ రంగనాథ స్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో స్వామివారు, దీపాలు వెలిగిస్తున్న భక్తులు

గుత్తిరూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా స్వామికి వేకువ జామున పంచామృతాభిషేకం వివిధ పుష్పాలతో అలంకరించి ఆకు పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం మహిళలు ఆలయ ఆవరణంలో దీపాలు వెలిగించారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామిని దర్శంచుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హనుమంతరావు



అనంతపురం విద్య, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా హనుమంతరావును ఎంపిక చేసినట్లు ఆ సంఘం జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమంతరావు వజ్రకరూరు మండలం వీసీపీ కొత్తకోట హైస్కూల్‌లో సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే ఎమ్మార్పీఎస్ ఉద్యమాల్లో క్రియాశీలకంగా పనిచేశారన్నారు. మందకృష్ణ భారీ కార్యక్రమాలకు మాదిగ ఉద్యోగులను, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలను చైతన్య పర్చడంలో ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన సేవలను గుర్తించి ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు స్పష్టం చేశారు.

పదోన్నతి జేఈఈలలో... ఆందోళన..!



- పీఆర్‌లో అడహక్ ప్రమోషన్లపై ప్రభుత్వం ఆరా
- హైకోర్టు తీర్పు అమలుకు ఉన్నతాధికారుల కసరత్తు

అనంతపురం సిటీ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలో సీనియారిటీని పక్కనపెట్టి గత సర్కార్ ఇచ్చిన జీఓ-71 ఆధారంగా ఇటీవల చేపట్టిన ఏఈఈలకు పదోన్నతులు కల్పించడంపై తప్పుపడుతూ.. సదరు జీఓను హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఆ పదోన్నతులు రద్దయ్యాయి. సీనియారిటి ప్రకారం పదోన్నతులు కల్పించాలని హైకోర్టు ఆదేశించడంతో నాన్‌ఏపీపీఎస్సీ బ్యాచ్‌లకు చెందిన ఏఈఈలకు ఊరట కలిగింది. పీఆర్‌శాఖలో జరిగిన అడహక్ ప్రమోషన్లతో పాటు హైకోర్టు తీర్పు.. తదితర విషయాలపై ప్రభుత్వం దృష్టిసారించినట్లు తెలిసింది. ఇదే క్రమంలో ఆ శాఖ ఉన్నతాధికారులు హైకోర్టు తీర్పుకు అనుగుణంగా తప్పులను సవరించుకునే పనిలో నిమగ్నమైనట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అడహక్ ప్రమోషన్లు పొందిన వారితో పాటు నాన్‌ఏపీపీఎస్సీ బ్యాచ్‌లకు చెందిన ఏఈఈలు, ఎఫ్‌ఏసీ, ఓడీల రూపంలో పనిచేస్తున్న ఏఈఈలలోను ఉత్కంఠ నెలకొంది.

- **ఈఎన్‌సీని కలిసేందుకు సన్నాహాలు**

హైకోర్టు తీర్పుతో నాన్‌ఏపీపీఎస్సీ బ్యాచ్‌లకు చెందిన ఏఈఈలలో ఉత్సాహం నెలకొంది. ఎన్నో ఏళ్ల నుంచి పోరాడి సాధించుకున్న కల తాజా తీర్పుతో నెరవేరిందని అంటున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని జోన్-1, జోన్-2, జోన్-3, జోన్-4 పరిధిలో పనిచేస్తున్న నాన్ ఏపీపీఎస్సీ బ్యాచ్‌లకు చెందిన ఏఈఈలందరూ కలిసి త్వరలోనే ఆ శాఖ ఈఎన్‌సీని కలిసి వెంటనే హైకోర్టు తీర్పును అమలు చేసి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించాలని కోరేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.



పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం

- **ఎఫ్‌ఏసీ, ఓడీలో పనిచేస్తున్న వారిలో ఉత్కంఠ**

పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతి రావాలన్నా.. ఎఫ్‌ఏసీ, ఓడీలపై పోస్టింగులు పొందాలన్నా చాలా కష్టమైన పని. ఈ నేపథ్యంలో అడహక్ పదోన్నతులు తెచ్చిన తంటాతో అసలుకే ఎసరు వచ్చింది. ప్రమోషన్లు ఇవ్వకపోయినా ఏదో ఒకరకంగా ఎఫ్‌ఏసీ, ఓడీల రూపంలో పనిచేసుకునే వాళ్లం అనే అభిప్రాయం నెలకొంది. అడహక్ పదోన్నతులు ఇవ్వడం.. హైకోర్టు సదరు జీఓను కొట్టివేయడంతో తమకు పెద్ద సమస్య వచ్చి పడిందని ఎఫ్ఏసీ, ఓడీల రూపంలో పనిచేసే ఏఈఈలో ఆందోళన నెలకొంది. హైకోర్టు తీర్పుతో అడహక్ ప్రమోషన్లను మాత్రమే రద్దు చేస్తారా..? లేక.. ఎఫ్‌ఏసీ, ఓడీలను కూడా రద్దు చేస్తారా..? అని సదరు వర్గాల్లో ఉత్కంఠ మొదలైంది.

హైకోర్టు తీర్పు అమలుకు కసరత్తు

ఎన్నో ఏళ్ల నుంచి ఏపీపీఎస్సీ, నాన్ ఏపీపీఎస్సీ బ్యాచ్‌ల మధ్య నెలకొన్న పదోన్నతుల ప్రక్రియ వ్యవహారంలో తాజాగా హైకోర్టు తీర్పుతో కొంత కొలిక్కి వచ్చినట్లయింది. దీంతో ఆ శాఖ ఉన్నతాధికారులు సైతం విమర్శలకు తావులేకుండా జాగ్రత్త పడుతున్నారనే తెలుస్తోంది. గత సర్కార్ ఇచ్చిన జీఓను హైకోర్టు కొట్టివేయడంతో ఇటీవల 1997 ఏపీపీఎస్సీ బ్యాచ్‌కు చెందిన అడహక్ పదోన్నతులను రద్దు చేసి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు కల్పించే దిశగా ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. అడహక్ పదోన్నతులు పొందిన వారికేనా..? గతంలో ఎఫ్‌ఏసీ, ఓడీల రూపంలో పనిచేస్తున్న వారికి కూడా ఇదే షరతు వర్తించేలా చేశారా.? అనే సందేహాలు మాత్రం లేకపోలేదు. గత సర్కార్ ఇచ్చిన జీఓ-71తో ఇటీవల అడహక్ పదోన్నతులు పొందిన 1997 ఏపీపీఎస్సీ బ్యాచ్‌కు చెందిన ఏఈఈలలో హైకోర్టు తీర్పుతో ఆందోళన మొదలైంది. అధికార లెక్కల ప్రకారం జోన్-1,-2,-3,4 పరిధిలో మొత్తంగా 50 మంది ఏఈఈలు అడహక్ పదోన్నతులు పొందినట్లు తెలిసింది.

ఫైలు కదలాలంటే.. పైసలివ్వాల్సిందే..!

- ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలో వింత పరిస్థితి
- వీఆర్‌ఓ లంచం డిమాండ్‌పై సోషల్‌మీడియాలో వైరల్
- గిరిధర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు

ధర్మవరంరూరల్, నవం బరు 23(ఆంధ్రజ్యోతి): స్థాని క తహసీల్దార్ కార్యాలయం లో చేయి తడపనిదే ఏ ఫైలు ముందుకు కదలదని బాధి తులు చెబుతున్నారు. పైసలు ఇవ్వకుంటే నెలల తరబడి తిరిగినా పని కాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం లంచాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అంత డబ్బు ఇవ్వలేం

మండలంలోని పోతుకుంట గ్రామంలో సర్వేనెంబర్ 695-1లో తమ భూమి రికార్డు పత్రాలను, అందుకు సంబంధించిన వివరాలను ఇవ్వాలని రైతు శ్రీలత గత రెండేళ్లుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డి మూడు లక్షలు డబ్బులు ఇవ్వాలని అదేకార్యాలయంలో ఓ కంప్యూటర్ ఆపరేటర్‌తో డీల్ చేయాలని ఆదేశించాడు. అయితే అంతడబ్బు ఇవ్వలేమని వారు తేల్చిచెప్పారు.

- నాగార్జున అనే వ్యక్తి గరుడంపల్లి గ్రామంలో భూమి కొనుగోలు చేశాడు. ఆభూమికి సంబంధించి రికార్డులు తమ పేరుపై ఉన్నాయని, రిజిస్టర్ కూడా చేసుకున్నామన్నారు. అయితే గ్రామానికి చెందిన కొంతమంది ఆ భూమిలో దొడ్లు ఏర్పాటు చేసుకున్నారు. వారికి పొజీషన్ సర్టిఫికెట్టు ఇస్తారని తెలియడంతో రెండు రోజుల కిందట నాగార్జున తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. తమ భూమికి పొజీషన్ సర్టిఫికెట్లు ఎలా ఇస్తారని, అడిగినంత డబ్బులు ఇస్తే చేస్తావా? లేకుంటే చేయవా అంటూ బూతులతో రెచ్చిపోయారు. వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డి కూడా బాధితుడిపై అదేస్థాయిలో రెచ్చిపోయారు. అప్పుడే పోతుకుంటకు చెందిన బాధితురాలు శ్రీలత కూడా అక్కడకు వచ్చి తమ రికార్డుల కోసం రూ. మూడు లక్షలు లంచం డిమాండ్ చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనలను అక్కడే ఉన్న కొంతమంది వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది.
- కుణుతూరు పంచాయతీలో అసైన్‌మెంట్ భూములను గత ప్రభుత్వంలో కొంతమంది వైసీపీ నాయకులు అవకతవకలు చేసి ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ఈ విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు వాటిని ఆన్‌లైన్‌లో 1బీ రాకుండా డిజిటల్ కీ పెండింగ్ పెట్టారు. అయితే ఈ భూములపై వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డి వారితో మాట్లాడి డబ్బులు వసులు చేసి డిజిటల్ కీ ఇప్పించారని అప్పట్లో కొంతమంది కార్యాలయానికి వచ్చి వాగ్వాదానికి దిగారు.

సీరియస్‌గా పరిగణించిన జిల్లా ఉన్నతాధికారులు

వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డి మూడు లక్షలు డిమాండ్ చేశాడని బాధితురాలు శ్రీలత చెప్పిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో జిల్లా ఉన్నతాధికారులు తీవ్రంగా స్పందించారు. వెంటనే విచారణకు ఆదేశించారు. ఇందుకు సంబంధించిన నివేదికను విచారణ చేసి పంపించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్‌బాబు బాధితులను విచారించారు. తమను లంచం అడిగిన విషయం వాస్తవేమని పలువురు బాధితులు తహసీల్దార్ వద్ద వాపోయినట్లు సమాచారం.

వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డి సస్పెన్షన్

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న దర్శినమల వీఆర్‌ఓ గిరిధర్‌రెడ్డిని జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ సస్పెన్షన్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేసినట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ సురేష్‌బాబు శనివారం తెలిపారు. రైతు నుంచి మూడు లక్షలు డిమాండ్ చేయడంతో పాటు గతంలో కూడా ఆయా గ్రామాలకు సంబంధించిన రికార్డుల తారుమారు చేయడం, అధికవర్షాల సమయంలో ఆర్డీఓ ఆదేశాలను బేఖాతార్ చేయడం వంటి అంశాలు వాస్తవమని తేలడంతో గిరిధర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

అంతా ఇష్టానుసారం..!

గిరిధర్‌రెడ్డి ఏడేళ్ల కిందట మండలంలోని దర్శినమల గ్రామానికి వీఆర్‌ఓగా వచ్చారు. అయితే ఆయన కొన్నాళ్ల దర్శినమల పంచాయతీతో పాటు ధర్మవరం వీఆర్‌ఓగా కూడా కొనసాగారు. ఎన్నికలకు రెండు నెలల ముందు నుంచి కుణుతూరు, పోతుకుంట, చిగిచెర్ల పంచాయతీలకు వీఆర్‌ఓగా కొనసాగారు. దీంతో ఇష్టానుసారంగా మ్యూటేషన్ అప్రూవల్స్ చేయించడం, రైతుల నుంచి లంచాలు పుచ్చుకుని పనులు చేసినట్లు పలువురు బాధితులు విమర్శిస్తున్నారు. ధర్మవరం తహసీల్దార్ కార్యాలయంలోకి పనులు కోసం వెళ్లే రైతులను అధికారులు లంచాలు అడుగుతుండటంతో హడలెత్తిపోతున్నారు. భూమి రికార్డుల నుంచి పాస్‌పుస్తకాలు కోసం, విద్యార్థుల సర్టిఫికెట్ల అప్రూవల్ ఇలా ఏ పనికోసం వెళ్లినా చేయి తడపాల్సిందేనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది మధ్య వర్తులను ఏర్పాటు చేసుకుని డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం.










కూలిన కుటుంబాలు

హైవేపై ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తలగాసిపల్లి వద్ద ఘోర ప్రమాదం

ఎనిమిది మంది మృతి..

ఐదుగురికి గాయాలు

అరటి తోటలో పనికి వచ్చి..

అనంత లోకాలకు..

మృతులు పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామస్థులు

గార్లదిన్నె, పుట్లూరు, అనంతపురం టౌన్/అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కూలి పనులు చేసుకుంటూ.. ఉన్నంతలో హాయిగా గడుపుతున్న కుటుంబాలలో పెను విషాదం అలుముకుంది. 'అరటి తోటకు ఎరువు వేసే పని ఉందంట.. పోదాం రండి..' అని పిలవగానే.. మొత్తం 13 మంది ఆటోలో ఆత్రంగా బయలుదేరారు. వేకువ జామున గజ గజ వణికించే చలిలో.. ముడుచుకుని కూర్చున్నారు. సూర్యుడు ఉదయించేలోగా పని ప్రదేశానికి చేరుకున్నారు. చక చకా పనులు ముగించుకుని.. సొంతూరుకు తిరుగుపయనమయ్యారు. తిమ్మంపేట సమీపంలోని అరటి తోట నుంచి కూలీల ఆటో హైవే ఎక్కింది. వారి స్వగ్రామం పుట్లూరు మండలం ఎల్లుట్ల. ఆ ఊరికి వెళ్లేందుకు గార్లదిన్నె నుంచి హైవే అండర్ పాస్ మీదుగా దారి ఉంది. ఆటో గార్లదిన్నె శివారులో తలగాసిపల్లి హైవే జంక్షన్ వద్దకు చేరుకుంది. అక్కడ రోడ్డు దాటి.. గార్లదిన్నెలోకి ప్రవేశించాలి. అటువైపు లారీ వస్తోంది. దీంతో ఆటోను ఆపాడు డ్రైవర్..! అది వెళ్లగానే ఆటోను కదిలించాడు. ఏమరుపాటులో.. లారీ వెనకాలే వస్తున్న ఆర్టీసీ బస్సును చూసుకోలేదు. రెండు క్షణాలుంటే హైవే దాటేవారు. కానీ కాల యముడు ఆ కాస్త సమయమూ ఇవ్వలేదు. బస్సు వేగంగా ఢీకొట్టడంతో ఆటోలో కూలీలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డారు. ఏం జరిగిందో తెలిసేలోగా ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు, ఆస్పత్రిలో నలుగురు ప్రాణాలు విడిచారు. అందరూ ఒకే ఊరి జనం. ఊరంతా విషాదం నింపి.. ఏకంగా ఎనిమిది మంది ఈ లోకాన్ని వీడిపోయారు. అయిన వారికి తీరని దుఃఖాన్ని మిగిల్చారు.

ఎనిమిది మంది..

ప్రమాదంలో బాలపెద్దయ్య (55), చిన్న నాగమ్మ (60), పెద్దక్క(68), రామాంజినమ్మ(35) జయరాముడు (48), చిన్ననాగన్న(55), కొండమ్మ(50), ఈశ్వరయ్య(56) మృతిచెందారు. పెద్దులమ్మ, గంగాధర్, లక్ష్మీదేవి, రామాంజినమ్మ, ఆటో డ్రైవర్ నీలకంఠేశ్వర తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఒక్కసారి లే నాన్నా..



కూలి పనుల కోసం వచ్చినవారిలో బాల పెద్దయ్య అలియాస్ తాతయ్య, ఆయన భార్య పెద్దులమ్మ ఉన్నారు. వీరి కూతురు నాగలక్ష్మి అనంతపురం నగరంలోని ఓ ప్రైవేటు కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ప్రమాదం గురించి తెలియగానే తీవ్ర ఆందోళనతో ఆస్పత్రికి చేరుకున్నారు. 'మా నాన్న ఎక్కడ..? మా అమ్మ ఎక్కడ..? వారికి ఎలా ఉంది..?' అని అక్కడున్నవారిని అడుగుతూ.. వారికోసం వెతికింది. 'మీ నాన్న ప్రమాద స్థలంలోనే చనిపోయారు. మృతదేహం మార్చురీలో ఉంది..' అని గ్రామస్థులు చెప్పడంతో అక్కడికి పరుగున వెళ్లి బోరున విలపించారు. 'నాన్నా.. ఒక్కసారి లే నాన్నా.. నావైపు చూడు..' అంటూ మృతదేహంపై పడి బోరున విలపించారు. అక్కడి నుంచి ఆస్పత్రి బెడ్‌పై ఉన్న తల్లి వద్దకు చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు.

బాధ్యతలు తీరే వేళ..

బాలపెద్దయ్య, పెద్దులమ్మ దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు నాగలక్ష్మి, బేబీ ఉన్నారు. కుమారుడు అనారోగ్య సమస్యలతో గతంలో మృతిచెందాడు. బేబీకి వివాహం చేశారు. నాగలక్ష్మికి పెళ్లి సంబంధం కుదిరింది. మాఘమాసంలో వివాహం పెట్టుకోవాలని అనుకున్నారు. అంతటితో తన బాధ్యత తీరిపోతుందని బాల పెద్దయ్య అందరితో అనేవాడు. చిన్న కూతురు పెళ్లి సంబంధం గురించి సంతోషంగా చెప్పుకునేవాడు. ఆ ముచ్చట తీరకుండానే ప్రమాదంలో ప్రాణాలు విడిచాడు.



ఇంత నిర్లక్ష్యమా..?

ప్రమాదం మధ్యాహ్నం జరిగితే.. విడతలవారీగా ఎనిమిది మంది చనిపోయారు. వీరిలో ఆస్పత్రిలో మృతిచెందినవారు నలుగురు. ప్రమాద బాధితుల గురించి వైద్యులు పెద్దగా పట్టించుకోలేదన్న విమర్శలు వస్తున్నాయి. సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత సెలవులో ఉన్నారు. ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఆత్మారామ్ బాధితులు వచ్చినప్పుడు కనిపించలేదు. క్యాజువాలిటీలో ఉన్న డాక్టర్లే బాధితులకు వైద్య సేవలు అందిస్తూ కనిపించారు. సాయంత్రం 4-30 గంటల సమయంలో ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌కు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేసి వివరాలు అడిగితే.. తాను ఇంకా ఆసుపత్రికి వెళ్లలేదని, తమ డాక్టర్లు, సిబ్బంది చికిత్స అందిస్తున్నారని తెలిపారు. ఇంత ఘోర ప్రమాదం జరిగితే.. వైద్యాధికారుల తీరు ఇలా ఉంది. ఎంపీ, కలెక్టర్ ఆసుపత్రికి వచ్చి బాధితులను పరామర్శించారు. పరిస్థితిని గమనించి.. ప్రైవేటు వైద్యశాలకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. క్షతగాత్రులు ఆస్పత్రికి రాగానే మెరుగైన వైద్యం అందించి ఉంటే.. ఒకరిద్దరైనా ప్రాణాలతో బయటపడేవారని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఒంటరిగా మిగిలిన సంధ్యారాణి




రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బి.చిన్న నాగమ్మ, చిన్న నాగన్న దంపతులకు ఇద్దరు కూతుళ్లు.. శాంతి, సంధ్యారాణి ఉన్నారు. శాంతికి వివాహం జరిగింది. సంధ్యారాణి డిగ్రీ చదువుతోంది. చిన్న కూతురును బాగా చదివించి, తన కాళ్లపై తాను నిలబడేలా చేయాలని తల్లిదండ్రులు పరితపించేవారు. అంతలోనే విధి వారిద్దరినీ బలితీసుకుంది. తల్లిదండ్రులను కోల్పోయిన సంధ్యారాణి ఒంటరిగా మిగిలిపోయింది

కొడుకు పెళ్లి చూడకుండానే..



రామాంజినమ్మ, కుళ్లాయప్ప దంపతులకు ఇద్దరు కూతుళ్లు చంద్రకళ, రేవతి, ఒక కుమారుడు కుశ్వంత్ ఉన్నారు. ఇద్దరు కూతుళ్లకు వివాహం జరిపించారు. కుమారుడిని ఒక ఇంటివాన్ని చేస్తే తమ బాధ్యత తీరిపోతుందని భావించారు. కొడుకు పెళ్లి చూడకనే రామాంజినమ్మ ప్రమాదంలో మృతిచెందారు. కూలి పనులకు భార్యను పంపించిన కుళ్లాయప్ప.. ఇంటి వద్దే ఉండిపోయాడు. విషయం తెలిగానే గుండెలు బాదుకుంటూ అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నాడు.

ఉమ్మడి కుటుంబంలో విషాదం



డి.పెద్ద నాగమ్మ, పుల్లయ్య దంపతులది ఉమ్మడి కుటుంబం. వీరికి ఇద్దరు కుమారులు శివయ్య, అశోక్, కూతురు శివమ్మ ఉన్నారు. అందరికీ వివాహం చేశారు. కొడుకులు, కోడళ్లతో కలిసి సంతోషంగా గడిపేవారు. ఉదయాన్నే కోడలు లక్ష్మీదేవితో కలిసి పెద్ద నాగమ్మ కూలి పనుల కోసం ఆటోలో వెళ్లింది. ప్రమాదంలో పెద్ద నాగమ్మ మరణించగా లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడ్డారు.



ఎల్లుట్లలో విషాదం

ఉదయాన్నే కూలి పనులకు వెళ్లినవారు ప్రమాదానికి గురయ్యారని తెలియగానే ఎల్లుట్లవాసులు తీవ్ర ఆవేదన చెందారు. చాలా మంది ప్రమాద స్థలానికి, అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. ఒకేసారి ఏడుగురు మృతి చెందడంతో గ్రామం మొత్తం శోకసంద్రంలో మునిగిపోయింది. ఎవరిని కదిలించినా కంటతడి పెడుతున్నారు. మృతులంతా ఎస్సీ కాలనీ వాసులు కావడంతో ఆ కాలనీలో నిశ్శబ్ద వాతావరణం అలుముకుంది. మృతదేహాలకు ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తామని తెలిపారు.

ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబం



రోడ్డు ప్రమాదంలో జయరాముడు మృతిచెందడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. జయరాం, జయమ్మ దంపతులు ఇద్దరూ కూలి పనులు చేస్తూ జీవించేవారు. వీరికి కుమారుడు భార్గవ్, కూతురు దేవి ఉన్నారు. భార్గవ్ ఇంటర్, దేవి ఏడో తరగతి చదువుతున్నారు. సంతోషంగా సాగిపోతున్న వారి జీవితంలో పెను విషాదం నెలకొంది. తండ్రిని కోల్పోయిన పిల్లల భవిష్యత్తు ఏమి టా అని జయమ్మ కన్నీరు మున్నీరు అయ్యారు. ఇద్దరినీ బాగా చదివించాలని చెప్పేవాడని, ఇప్పుడు తమకు దిక్కెవరని ఆమె బోరున విలపించారు.

ఒకరి వెనుక ఒకరు..



కూలీ పనులకు ఉదయాన్నే భర్త ఈశ్వరయ్యతో కలిసి వెళ్లిన కొండమ్మ.. ప్రమాదంలో మృతిచెందారు. ఈశ్వరయ్య తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. భార్య మృతి చెందిన విషయం తెలిసి కన్నీరుమున్నీరయ్యాడు. పరిస్థితి విషమంగా మారడంతో సర్వజన వైద్యశాల నుంచి నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయినా ఫలితం లేకపోయింది. రాత్రి 10 గంటల సమయంలో ఈశ్వరయ్య కూడా మృతిచెందాడు. వీరికి కుమారుడు హర్ష, కూతురు అనిత ఉన్నారు. ఇద్దరినీ బాగా చదివించి, ఉన్నతంగా చూడాలని కష్టపడ్డారు. తల్లిదండ్రుల కలలను నెరవేరుస్తూ.. కొడుకు ఇటీవలే పోలీసు కానిస్టేబుల్ అయ్యాడు. త్వరలో పెళ్లి చేయాలని భావించారు. అనిత చదువు కొనసాగిస్తోంది. ఇంతలో తల్లిదండ్రులు ఇద్దరూ మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది.



క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి సవిత

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి

రూ.5 లక్షల పరిహారం ప్రకటన

అనంతపురం/అర్బన్/కల్చరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గార్లదిన్నె మండలం తలగాసిపల్లి జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆటోను ఆర్టీసీ బస్సు ఢీ కొనడతో ఎనిమిది మంది కూలీలు మృతి చెందడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం కూలీ పనులకు వెళుతూ చనిపోవడంపై సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసానిచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారాన్ని ప్రకటించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

ఆదుకుంటాం: పయ్యావుల

రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకుంటామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ప్రమాదం పట్ల ఆయన దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం రూ.5 లక్షలు చొప్పున పరిహారాన్ని ప్రకటించిందని తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని కలెక్టర్, ఎస్పీని ఆదేశించారు.

బాధాకరం: సవిత

ఘోర ప్రమాదంపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఎనిమిది మంది మృతిచెందారని, చాలా బాధాకరమని అన్నారు. నగర శివారులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని, బాధిత కుటుంబాలను ఆమె పరామర్శించారు. సర్వజన వైద్యశాల మార్చురీలోని మృతదేహాలను పరిశీలించారు. సీఎం చంద్రబాబు ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించారని తెలిపారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీని ఆదేశించామని తెలిపారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, ఆర్డీఓ కేశవనాయుడు, డీఎస్పీ వెంకటేశ్వర్లు, సర్వజన వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాం మంత్రి వెంట ఉన్నారు.

బాధితులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే శ్రావణి

శింగనమల నియోజకవర్గంలో ఘోర రోడ్డు ప్రమాదం జరగడంతో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ స్పందించారు. మృతులు, గాయపడ్డవారి కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆమె వైద్యాధికారులకు సూచించారు. ప్రమాదంపై ఆమె తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. విజయవాడ నుంచి ఆమె బాధిత కుటుంబాలవారితో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు.

దగ్గుపాటి ఆవేదన

ఘోర ప్రమాదంలో కూలీలు మృతి చెందడం బాధాకరమని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల మృతిపై దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సానుభూతి తెలిపారు. ప్రభుత్వం అండగా ఉంటుందని, గాయపడ్డవారికి మెరుగైన వైద్యం చేయిస్తామని భరోసా ఇచ్చారు.

వెంకటశివుడు యాదవ్ సంతాపం

రోడ్డు ప్రమాదంలో కూలీలు మృతి చెందడం బాధాకరమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు.

ప్రభుత్వం ఆదుకుంటుంది: పూల నాగరాజు

ప్రమాద బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూలనాగరాజు అన్నారు. గాండ్ల తెలికుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ విశాలాక్షితో కలిసి ఆయన ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు.

బాధితులను ఆదుకోవాలి: ఓబులు

ప్రమాద బాధిత కటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని సీఐటీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులతో కలిసి ఆయన ఆస్పత్రిలో బాధితులను పరామర్శించారు. మృతుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా చూడాలని, వారి ఇళ్లలో విద్యార్థులను చదివించాలని కలెక్టర్‌ను కోరారు. కూలీల కుటుంబాలను ఆదుకోవాలని ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ప్రభుత్వాన్ని కోరారు.

ఆదుకోవాలి: రాంభూపాల్

గార్లదిన్నె మండలం తలగాసిపల్లి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన వ్యవసాయ కూలీల కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



ఆశోక్ (ఫైల్)

గార్లదిన్నె, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక మండల పరిధిలోని మర్తాడు గ్రామానికి చెందిన ఆశోక్ (35) అనే రైతు శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామంలోని ఆశోక్, రాధిక దంపతులు నాలుగు ఎకరాల పొలంలో వేరుశనగ, వరి పంటలు సాగుచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆ పంటల్లో దిగుబడి రాలేదు. దీంతో పొలంలో రెండు బోర్లు వేసి చీనీ పంటను సాగుచేశారు. గత ఏడాది బోర్లలో నీరు రాకపోవడంతో మరో నాలుగు బోర్లు వేశారు. అయినప్పటికి నీరు పడలేదు. వచ్చే అరకొర నీటితోనే చీనీ చెట్లను కాపాడుకుంటున్నారు. పెట్టుబడులు, బోర్ల కోసం సుమారు రూ. 15 లక్షల వరకు అప్పులు చేశారు. అప్పులు తీర్చే మార్గం లేక, దిక్కుతోచని స్థితిలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం కుటుంబ సభ్యులు వచ్చి చూడగా ఆశోక్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా బోరున విలపించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆత్మహత్యపై కుటుంబ సభ్యులతో ఆరా తీశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి అంధుల అథ్లెటిక్ పోటీలు ప్రారంభం



అంధ క్రీడాకారుల హైజంప్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అంధుల రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలు స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో శనివారం ప్రారంభమయ్యాయి. అంధుల అథ్లెటిక్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి డేవిడ్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ఇతరులతో సమానంగా దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించడం శుభపరిణామమని, ఇదే స్ఫూర్తితో క్రీడా పోటీల్లోనూ ముందంజలో నిలుస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రెండు రోజుల పాటు సాగే ఈ పోటీల్లో తొలిరోజు పురుషులకు 100 మీటర్ల నుంచి 5వేల మీటర్ల వరకు పరుగు పోటీలు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్ త్రో, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. మహిళలకు 100మీటర్ల నుంచి 1500 మీటర్ల వరకు పరుగు పోటీలు, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అంధ క్రీడాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరమణ, రఘుకుమార్, ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, కోచ్ సురేష్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

నర్సాపురం వద్ద కొత్త రైల్వేస్టేషన్

17.97 ఎకరాల భూమి కొనుగోలు

రైతులకు మేలు చేసేలా అధికారులు పనిచేయాలి

సమీక్షలో కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): బెళుగుప్ప మండలం నర్సాపురం గ్రామ పరిధిలో నూతన రైల్వేస్టేషన్ నిర్మాణం చేపడుతున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ వెల్లడించారు. శనివారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మతో కలిసి సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త రైల్వేస్టేషన్ నిర్మాణానికి 17.97 ఎకరాల భూమి అవసరం ఉందన్నారు. నర్సాపురం గ్రామ సర్వే నెంబరు 177లో 9.92 ఎకరాలు, సర్వే నెంబరు 178లో 8.05 ఎకరాలు మొత్తం 17మంది రైతులకు సంబంధించి 17.97ఎకరాల భూమిని సేకరిస్తున్నామని తెలిపారు. ఎకరాకు రూ.6.25 లక్షలు ధర నిర్ణయించినట్లు వివరించారు. బహిరంగ మార్కెట్‌లో ఎకరా రూ.30 లక్షల నుంచి రూ. 33 లక్షల వరకు ఉందని, ఆ మేరకు పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలు చేసేందుకు చిత్తశుద్ధితో ఉందన్నారు. బెళుగుప్ప మండలం నర్సాపురం పరిధిలో ఒక ఏడాదిపాటు భూముల క్రయవిక్రయాలకు సంబంధించిన సమాచారంతో నివేదిక ఇవ్వాలని జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ఒకవేళ ఏడాదిలో అక్కడ క్రయవిక్రయాలు జరగకుండా ఉంటే సమీపంలో ఎలా జరిగాయో వాటి వివరాలు సేకరించి నివేదిక ఇవ్వాలన్నారు. ఈ విషయంలో ప్రతి అధికారి చిత్తశుద్ధితో వ్యవహరించాలని తెలిపారు. సమావేశంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, రైల్వేశాఖ నుంచి జగదీష్‌సాయి, హార్టికల్చర్ డీడీ నరసింహారావు, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీ డివిజన్ ఈఈగా శరత్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ డివిజన్ ఈఈగా శరత్‌కుమార్‌ను నియమిస్తూ జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల తెలుగుగంగ ప్రాజెక్ట్‌లో డీఈగా పనిచేస్తున్న శరత్‌కుమార్‌ను హెచ్చెల్సీ డివిజన్ ఈఈగా బదిలీ చేశారు. ఇదివరకు హెచ్చెల్సీ డివిజన్ ఈఈగా ఉన్న శ్రీనివాసులు గత నెల పదవీ విరమణ పొందారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం సబ్‌డివిజన్-2లో డీఈగా పనిచేస్తున్న వెంకటేశులు శెట్టిని ధర్మవరం డివిజన్-10 ఈఈగా బదిలీ చేశారు. మైనర్ ఇరిగేషన్ ఐబీ డివిజన్‌లో తాడిపత్రి డీఈగా పనిచేస్తున్న రాము ఆరవేటిని అనంతపురం ఇరిగేషన్ ఐబీ డివిజన్ ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. మైనర్ ఇరిగేషన్ సర్కిల్‌లో డీఈగా ఉన్న ఉషారాణిని కర్నూలు హంద్రీనీవా ఎస్ఈ కార్యాలయలో డిప్యూటీ ఎస్ఈగా బదిలీ చేశారు.

వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ



అటవీ స్థలాల ఆక్రమణపై చర్యలు

నూతన డీఎఫ్ఓ విఘ్నేష్ అప్పా

అనంతపురం న్యూటౌన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు నూతన డీఎఫ్ఓ విఘ్నేష్ అప్పా పేర్కొన్నారు. శనివారం జిల్లా అటవీశాఖ కార్యాలయంలోని తమ చాంబర్‌లో ఆయన పలు అంశాలను వెల్లడించారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో కృష్ణ జింకలు, ఇతర వన్యప్రాణుల నుంచి రైతులు పంటలు నష్టపోతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో స్థానిక సిబ్బంది ద్వారా కృష్ణ జింకల సంఖ్య ఎంత ఉందన్న వివరాలు తయారు చేయాలని ఆదేశించామని తెలిపారు. వివరాలు వచ్చిన వెంటనే వాటికి రక్షణ కల్పించడంతో పాటు రైతులకు పంట నష్టం కలగకుండా చర్యలు చేపడతామన్నారు. జిల్లాలో అటవీ స్థలాలకు సంబంధించి ఆక్రమణలు ఉన్నట్లు తెలిసిందని వివరించారు. అటవీ స్థలాల్లో ఆక్రమణలు ఉంటే వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో హద్దులు ఏర్పాటు చేశామన్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా హద్దులు ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. కళ్యాణదుర్గం, రాయదుర్గం ప్రాంతాల్లో స్థానిక ప్రజలకు ఆహ్లాదం పెంచేలా నగర వనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మొక్కలు నాటడానికి ప్రాధాన్యం కల్పించి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామని తెలిపారు.

న్యూస్ బాక్స్

ఘనంగా బాబా జయంతి వేడుకలు



సత్యసాయి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

నల్లమాడ, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : భగవాన్‌సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు శనివారం టీడీపీ మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలువురు బాబా సేవలను కొనియాడారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. బుట్టి నాగభూషణంనాయుడు, సత్యసాయి వాటర్ కార్మికులు వెంకటేష్, శంకర్, సుధాకర్, నాగభూషణం, నాయకులు ఆదిమూలం అశోక్‌కుమార్, మంజునాథ్‌రెడ్డి, ఎస్ కేశవరెడ్డి, ఎస్ సూర్యనారాయణరెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: భగవాన్ సత్యసాయిబా జయంతి సందర్భంగా మండలంలోని కొండకమర్ల గ్రామంలో శనివారం సీఆర్‌పీ రిజ్వానా మహిళలకు చీరలు, పురుషులకు పంచ, టవల్ పంపిణీ చేశారు. అనంతరం బాబా జయంతి వేడుకలు జరుపుకున్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఓబుళదేవరచెరువు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 26న తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. శనివారం మండలకేంద్రంలో అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ పేద, మధ్యతరగతి వర్గాల నడ్డి విరించిందన్నారు. ఉపాధి పనిదినాలు రెండునెలలు పెంచి రోజు వేతం రూ.600 చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి పెడబల్లి బాబా, సీఐటీయూ మండల కార్యదర్శి కుళ్లాయప్ప, రమణ, శ్రీరాములు, రామారావు, శ్రీనివాసులు, వేణు, శివ, ఆంజి, బాషా పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

ఓబుళదేవరచెరువు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం చాల అవసరమని కొండకమర్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్ అన్నారు. పాఠశాలలో 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు శనివారం మండలకేంద్రంలోని కంప్యూటర్ శిక్షణతోపాటు, మామిళ్లకుంటపల్లి గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. కంప్యూటర్ విద్యపై అవగాహనకల్పించారు. ప్రతి విద్యార్థి కంప్యూటర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రిజమ్, ఒకేషనల్ ట్రైనర్ స్వర్ణలత, విద్యార్థులు పాల్గొన్నారు.

శక్తి సామర్థ్యాలకు స్త్రీ నిదర్శనం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ రాధిక

కదిరి లీగల్ 23 (ఆంధ్రజ్యోతి): శక్తి సామర్థ్యాలకు మహిళ నిదర్శనమని మహిళా సదస్సులో వక్తలు అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశం మేరకు మండల న్యాయ అధికార సేవా సంస్థ ఆధ్వర్యంలో విధాన్సే సమాధాన్ ద్వారా మహిళా చైతన్య న్యాయ సదస్సులను కొనసాగిస్తున్నారు. శనివారం కదిరి రూరల్ మండలం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో డైరెక్టర్ ఎం రాధిక అధ్యక్షతన సదస్సును నిర్వహించారు. ఆర్డీటీ ఆర్డీ శాంతమ్మ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు రామలక్ష్మి, ప్రభావతి, అలివేలమ్మ, ప్రతిభ మైత్రి మహిళా సంఘం రాజేశ్వరి, న్యాయవాది లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎంతో ఓర్పు నేర్పులతో కుటుంబ పోషణ భారాన్ని మోస్తూనే పిల్లలను తీర్చిదిద్దే బాధ్యతలను స్త్రీ నిర్వహిస్తుందని ఆర్డీ శాంతమ్మ అన్నారు. మహిళా సంక్షేమం కోసం న్యాయవ్యవస్థ నడుంబిగించడం శుభ పరిణామం అన్నారు. ఆర్డీటీ ద్వారా మహిళలకు అందుతున్న సౌకర్యాలను వివరించారు.

ఏఐఎస్‌పీ జిల్లా మహాసభలు ప్రారంభం

కదిరి అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆల్‌ఇండియా స్టూడెంట్ ఫవర్ (ఏఐఎస్‌పీ) జిల్లా మహాసభలు శనివారం కదిరి మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు పర్వీన్‌భాను హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై మాజీ రాజీలేని పోరాటాలు చేస్తోందన్నారు. మాజీ ఇన్‌చార్జి రాజేష్ మాట్లాడుతూ సత్యసాయి జిల్లాకు యూనివర్శిటీ, మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలకోసం పోరాటాలు చేస్తామన్నారు. విద్యార్థి సంఘం నాయకులు నరసింహ, ప్రదీప్‌కుమార్, పృథ్వీ రాకేష్ తదితరులున్నారు.

న్యాయవాదుల నిరసన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, న్యాయవాదులు

ధర్మవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): వైజాగ్‌లో లా స్టూడెంట్‌పై గ్యాంగ్‌రేప్‌ను నిరసిస్తూ పట్టణంలో ఆలిండియా లాయర్ యూనియన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన తెలిపారు. న్యాయవాదులు విద్యార్థులతో కలిసి కళాజ్యోతి సర్కిల్‌కు చేరుకుని అక్కడ నిరసన చేశారు. అనంతరం న్యాయవాదులు మాట్లాడుతూ విద్యార్థిని పట్ల అమానుషంగా ప్రవర్తించిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఇడప బత్తినిప్రసాద్, న్యాయవాదులు సుమమలత, బాలత్రిపురసుందరి, బార్గవి, విద్యార్థిసంఘం నాయకులు నరేంద్ర, నంద పాల్గొన్నారు.

మూడు నెలల పింఛన్ ఒకేసారి తీసుకోవచ్చు

ధర్మవరంరూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ విధానంలో పలు మార్పులు తీసుకువచ్చిందని, ఇకపై రెండునెలల పాటు వరుసగా పెన్షన్ తీసుకోకపోయిన మూడో నెలలో ఆమొత్తాన్ని చెల్లిస్తామని ఎంపీడీఓ సాయిమనోహర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడునెలలు వరుసగా పెన్షన్ తీసుకోకపోతే వారి పెన్షన్ ఆపివేస్తామన్నారు.

మట్టి రోడ్లకు మోక్షమెన్నడో..?

- ముందుకు సాగని సీసీ రోడ్ల పనులు
- కొన్ని గ్రామాల్లో ప్రారంభమే కాని వైనం
- నియోజకవర్గానికి రూ.12 కోట్లు విడుదల
- పంపకాలు తెమలకపోవడమే జాప్యానికి కారణమా..?

ధర్మవరం రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజవర్గాల్లోనూ సీసీ రోడ్లు వేస్తున్నా, ధర్మవరం నియోజకవర్గంలో మాత్రం ఆ పనులు ముందుకు సాగడం లేదు. ధర్మవరం, బత్తలపల్లి మండలాల్లో పనులే ప్రారంభించలేదు. ముదిగుబ్బ, తాడిమర్రి మండలాల్లో తొలుత కొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించినా అవి కూడా ముందుకు సాగడం లేదు. మరికొన్ని గ్రామాల్లో అసలు పనులే ప్రారంభించలేదు. మంత్రి సత్యకుమార్ యాదవ్ భూమి పూజ చేసినప్పటికీ ఇంతవరకు ఆ రోడ్డు నిర్మాణానికి నోచుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో ఒక్క అభివృద్ధి కార్యక్రమం జరగలేదని, కూటమి ప్రభుత్వంలోనైనా గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎదురుచూస్తున్న తమకు మట్టి రోడ్లే మిగిలాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శంకుస్థాపన చేసినా మొదలుకాని ముదిగుబ్బలోని టీచర్స్ కాలనీ రోడ్డు

నియోజవర్గానికి రూ.12 కోట్లు విడుదల

ధర్మవరం నియోజకవర్గంలో 26 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల నిర్మాణానికి మండలానికి రూ. 3కోట్లు చొప్పున రూ.12కోట్లు నిధులు విడుదలైనట్లు పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడెక్కడా రోడ్లు వేయాలో గుర్తించి అంచనాలు సిద్ధం చేశారు. అయితే పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

ముందుకు సాగని పనులు

గత నెల 20న పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎంపీ బీకేపార్థసారధి ముదిగుబ్బ మండలకేంద్రం, తాడిమర్రి మండలం ఏకపాదంపల్లి, ధర్మవరం మండలం గొట్లూరు గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అయితే నెలరోజులు దాటిన ఇంతవరకు రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఈ పనులను గ్రామాల్లో కూటమి నేతలు ఎవరికి ఇవ్వాలనే వాటిపై తర్జనభర్జన పడుతుం డటంతోనే ఆలస్యం అవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే కొన్ని గ్రామాల కాంట్రాక్టర్ల లిస్టు పంచాయతీరాజ్ కార్యాలయానికి అందజేసి నప్పటికీ మరికొన్ని గ్రా మాలకు ఇంకా అంద జేయ లేదని, దీంతో పనులు ఆలస్యమవుతున్నట్లు సమాచారం.



అక్టోబరు 20న ధర్మవరం మండలం గొట్లూరులో భూమిపూజచేసిన రోడ్డు ఇదే..



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ (ఫైల్)

త్వరలో పనులు ప్రారంభిస్తాం

నియోజకవర్గంలో సీసీరోడ్ల పనులు త్వరలోనే ప్రారంభిస్తాం. మండలా నికి రూ. మూడు కోట్లు చెప్పున నిధులు మంజూరు అయ్యాయి. ఇప్పటికే పనులను గుర్తించాం. తాడిమర్రి, బత్తలపల్లి మండలాల్లో కొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించాం. మరికొన్ని గ్రామాల్లో కాంట్రాక్టర్లతో త్వరలోనే పనులు ప్రారంభించి నిర్మాణాలు త్వరగా పూర్తి చేయిస్తాం.

- శ్రీరాములు, పంచాయతీరాజ్ డీఈఈ, ధర్మవరం

కరువు రహిత ధర్మవరమే లక్ష్యం

- మంత్రి సత్యకుమార్, పరిటాలశ్రీరామ్, చిలకం మధు
- ధర్మవరం చెరువు ఆయకట్టుకు నీటి విడుదల

ధర్మవరం రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కరువు రహిత ధర్మవరమే మా ప్రభుత్వం లక్ష్యమని మంత్రి సత్యకుమార్‌యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ అన్నారు. మండలంలోని రావులచెరువు గ్రామంలో మరువపారుతున్న చెరువు వద్ద ఆయన పరిటాలశ్రీరామ్, జనసేన నాయకుడు చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి శనివారం గంగపూజ నిర్వహించారు. వారికి రావులచెరువు గ్రామస్థులు పెద్దఎత్తున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అక్కడినుంచి ధర్మవరం చెరువు వద్దకు వెళ్లి ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. దీంతో చిన్నూరు, చిన్నూరు బత్తలపల్లి, ధర్మపురి, తుమ్మల, తిప్పేపల్లి గ్రామపరిధిలోని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా ధర్మవరం నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గతంలో నాయకులు బోటుషికారు కోసం, విలాసాల కోసం ధర్మవరం చెరువు పూర్తిస్థాయిలో నిండినప్పటికీ ఆయకట్టుకు నీరు విడుదల చేయలేదని విమర్శించారు. ఆరోజే తాము అధికారంలోకి రాగానే ఆయకట్టుకు నీరు విడుదల చేస్తామని స్పష్టంగా చెప్పామని, ఆమేరకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ప్రతి నీటిబొట్టును సద్వినియోగం చేసుకుని రైతులు పంటలు పండించుకోవాలన్నారు. తమ ప్రభుత్వం రైతుల కోసం ఎంతఖర్చు చేయడానికైనా, ఏ నిర్ణయం తీసుకోవడానికైనా సిద్ధంగా ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేష్, ఇరిగేషన్ అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



చెరువు వద్ద గంగపూజలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్, పరిటాలశ్రీరామ్, చిలకం

టీడీపీ నాయకుడు వెంకటరామిరెడ్డి మృతి



తనకల్లు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నచెరువుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వెంకటామిరెడ్డి(65) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. పార్టీలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతూ, ఈతోడు, సీఆర్ పంచాయతీల్లో పార్టీ అభివృద్ధికి శ్రమించారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటరామిరెడ్డి మృతిచెందిన విషయం తెలుసుకున్న మండల కన్వీనర్ తొట్లి రెడ్డిశేఖర్ రెడ్డి, ఈతోడు మాజీ ఎంపీటీసీ వేణురెడ్డి, నాయకులు శ్రీధర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, రెడ్డం శ్రీనాథ్‌రెడ్డి, హరినాయక్, బ్రహ్మానందరెడ్డి, భూషణతోపాటు పలువురు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

సత్యసాయి సేవలు మరువలేనివి : చిలకం



మహిళలకు చీరలు అందజేస్తున్న జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి

ధర్మవరం, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా సేవలు మరువలేనివని జనసేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి కొనియాడారు. సత్యసాయి బాబా 99వ జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని యాదవవీధిలో జనసేన పార్టీ నాయకుడు డిష్‌రాజు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం, దుస్తుల పంపిణీ, అన్నదాన కార్యక్రమాలకు చిలకం మధుసూదన్‌రెడ్డి, ఆయన సతీమణి చిలకం ఛాయాదేవిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు వారు చీరలను పంపిణీ చేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు అడ్డగిరి శ్యాంకుమార్, డిష్‌రాజు,తొండమాల రవి, తోపుదుర్తి వెంకటరాముడు, గొట్లూరు చంద్ర, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న మంత్రి: స్థానిక లక్ష్మీచెన్నకేశవపురంలో శనివారం నిర్వహించిన సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. సర్కిల్లో ఏర్పాటుచేసిన సత్యసాయిబాబా చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, అనంతపురం జిల్లా బీజేపీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణయాదవ్, నాయకులు హరీశ్‌బాబు, జోలారాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: మండలకేంద్రంలో సత్యసాయి జయంతి వేడుకలు సత్యసాయి వాటర్ సప్లై వర్కర్లు శనివారం ఘనంగా నిర్వహించారు. వర్కర్లు సత్యసాయి బాబా చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూజలు చేశారు. అనంతరం ఆర్డీటీ ఆస్పత్రి వద్ద అన్నదానం నిర్వహించారు.

కొత్తచెరువు: సత్యసాయి బాబాజయంతి వేడుకలను కొత్తచెరువులో శనివారం భక్తులు, ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా సత్యసాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు.

సాయిసేవలో పర్తివాసులు

పుట్టపర్తిరూరల్: సత్యసాయిబాబా 99వ జయంతోత్సవాలను పురస్కరించుకుని పట్టణవాసులు, పలువురు భక్తులు, స్వచ్ఛందసంస్థలు భక్తులకు తమవంతు సహాయసహకారాలు అందించారు. ప్రశాంతినిలయంలో సత్యసాయిసెంట్రల్ ఆధ్వర్యంలో భారీస్థాయిలో నారాయణసేవ నిర్వహించగా పట్టణంలో బస్టాండు, గోపురం ప్రధానరహదారి, హనుమాన్‌అలయంకూడలి, చిత్రావతిహారతిఘాట్, వాసవీనివాస్ వద్ద నారాయణసేవ, మంచినీరు అందించారు

ఆరోగ్య ఆంధ్రప్రదేశే సీఎం ధ్యేయం

- మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి
- 13 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి సత్యకుమార్ ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీమంత్రి పల్లెరఘునాథరెడ్డి

పుట్టపర్తిరూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆపన్నహస్తం అందించడం, రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు ధ్యేయమని మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో 13 మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.19లక్షల చెక్కులను శనివారం వారు అందించారు. బుక్కపట్నానికి చెందిన చీకటినరేష్ రూ.4,00165, వెంగళమ్మచెరువు ఈడిగ నీళ్లరమణకు రూ.5,13,134, పాముదుర్తి కాలసముద్రం రామక్కకు రూ.18వేలు, ఓడీచెరువు మండలం కొండకమర్లకు చెందిన అల్లాబక్ష్‌కు రూ.2,17,500, ఓడీచెరువు దేరంగులు ఆదర్ష్ రూ.45వేలు, కొండకమర్ల కొలిమి ముంతాజ్‌వలీఖాన్ రూ.2,24100, పెగొళ్ళ శంకరమ్మకు రూ.1,53,930 చెక్కులను మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి అందించారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పిలుపినిచ్చారు. పట్టణంలోని ఆర్యవైశ్య ఆధ్వర్యంలో శనివారం వాసవీనివాస్ సత్రంలో సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవాలను పురస్కరించుకుని అన్నదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, మాజీమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సేవాగుణంలో ముందువరుసలో ఉంటారని కొనియాడారు. అనంతరం వాసవీనివాస్ సంఘం నాయకులు ఎమ్మెల్యే, మాజీమంత్రిని పట్టుశాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు దేవికి వెంకటేశ్వర్లు, సభ్యులు ప్రవీణ్‌కుమార్, జగదీష్, రాంకుమార్, శంకర్‌బాబు, వాసుపున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

అదానీని అరెస్టు చేయాలి

ధర్మవరం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలకు పాల్పడిన అదానీని తక్షణమే అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అదాని గ్రూపుతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న విద్యుత్‌తో పాటు అన్ని రకాల ఒప్పందాలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శిమారుతి, సీనియర్ నాయకులు ఎస్‌హెచ్‌బాషా, చేనేత కార్మికసంఘం జిల్లా నాయకులు హరి,గోపీ పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం



మాట్లాడుతున్న ఖతిజాన్‌కుబ్రా

ధర్మవరంరూరల్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, 18సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకుని ఓటుహక్కును వినియోగించుకోవాలని రెవెన్యూ డివిజనల్ ఏఓ ఖతిజాన్‌కుబ్రా తెలిపారు. పట్టణంలోని వివేకానంద డిగ్రీకళాశాలలో విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటు అనేది రాష్ట్రం, దేశంలో మంచి పరిపాలనకు శ్రీకారం చుడుతుందన్నారు. ఓటును సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధికి మార్గదర్శకం సుగమం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఈడీటీ ఈశ్వరయ్య, ఎన్నికల్ సీనియర్ అసిస్టెంట్ రాఘవరెడ్డి, సిబ్బంది రాజ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ హర్షవర్ధన్, అధ్యాపకబృందం రమేష్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తచెరువు: బీఎల్‌ఓలు ఓటరు నమోదు కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలంటూ ఆర్ఐ కిరణ్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్ల వద్ద శనివారం ఓటరు నమోదు పైలెట్ ప్రాజెక్టును ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ...18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు కార్డులో ఏవైనా తప్పులుంటే సరిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో భార్గవ్, వీఆర్ఏ శివ, బీఎల్‌ఓలు స్వామి, ప్రసాద్ పాల్గొన్నారు.

అధికారుల సమక్షంలోనే దాడికి యత్నం

తనకల్లు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ అధికారుల సమక్షంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విధి నిర్వహణలో ఉన్న ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్ అరుణ్‌కుమార్‌పై చిన్నరామన్నగారిపల్లి పంచాయతీ కార్యదర్శి సాదిక్‌వలి దాడికి ప్రయత్నించినట్లు పోలీసులకు శనివారం ఇన్‌చార్జి తహసీల్దార్ మల్లికార్జున ఫిర్యాదుచేశారు. అరుణ్‌కుమార్ తహసీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈతోడు సచివాలయంలో చిన్నరామన్నగారిపల్లి పంచాయతీ కార్యదర్శిగా సాదిక్‌వలీ పనిచేస్తున్నారు. అతనికి బీఎల్‌ఓగా 241 కేంద్రాన్ని విధులు నిర్వహించడానికి అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వులను తీసుకెళ్లాలని కంప్యూటర్ ఆపరేటర్ ఆయనకు ఫోన్ చేసి చెప్పారు. ఫోన్‌లోనే ఆగ్రహించిన సాదిక్ నీవేవరు నన్ను బీఎల్‌ఓగా నియమించడానికి అంటూ దుర్భాషలాడినట్లు పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 1.45 గంటలకు రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన కార్యదర్శి కంప్యూటర్ ఆపరేషటర్‌పై దాడికి ప్రయత్నించారు. రెవెన్యూ అధికారులు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా కార్యదర్శి వినిపించుకోలేదు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్‌కు కంప్యూటర్ ఆపరేటర్ ఫిర్యాదు చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ పోలీసులు, ఎంపీడీఓకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కార్యదర్శి సాదిక్ వలిని వివరణ కోరగా బీఎల్‌ఓగా నియమించవద్దని, పనులు ఎక్కువగా ఉన్నాయని చెప్పినా, కంప్యూటర్ ఆపరేటర్ దుర్భాషలాడినట్లు చెప్పారు. తాను కూడా పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో బాలింత మృతి

బత్తలపల్లి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ ఆసుపత్రిలో శనివారం రాత్రి గుండెపోటుతో బాలింత శారద(29) మృతి చెందారు. బంధువులు తెలిపిన మేరకు బెళుగుప్ప మండల కేంద్రానికి చెందిన ఆంజనేయులు, అతడి భార్య శారద జీవనోపాధి కోసం అనంతపురంలో నివసిస్తున్నారు. శారద రెండో కాన్పు కోసం ఈ నెల 20న బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో చేరారు. ఆమెకు శనివారం నొప్పులు రావడంతో సిజేరియన్ చేశారు. మగ బిడ్డకు జన్మనిచ్చారు. ఆ సమయంలో శారదకు గుండె పోటు రావడంతో వైద్యులు సిపిఆర్ చేశారు. అనంతరం ఐసీయూకి తరలించి పర్యవేక్షిస్తుండగా మరో సారి గుండె పోటు వచ్చింది. దీంతో బాలింత శారద మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు బోరున విలపించారు. బాలింత మృతదేహాన్ని ఆర్డీటీ వారు అంబులెన్స్‌లో వారి స్వగ్రామానికి పంపారు. మృతురాలికి భర్తతో పాటు ఐదేళ్ల కుమార్తె ఉన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌తో ఉద్యోగ అవకాశాలు

హిందూపురం అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌సీఏ), ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణతో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని ఆ సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ గోవిందరాజులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు రెండు నెలలపాటు ఎలెక్ట్రీషియన్ ట్రేడ్‌లో శిక్షణ అందించి సర్టిఫికెట్ ఇస్తామన్నారు. అదేవిధంగా కేంద్రరాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. 35 సంవత్సరాలు లోపల ఉన్న యువకులు ఈ నెల 28వ తేదీలోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదవతరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. వివరాలకు 9052901657 నెంబరులో సంప్రదించాలన్నారు.

ఆలయ ఆదాయంపై నివేదిక ఇవ్వాలి

మడకశిర రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : భక్తరహళ్ళి నరసింహస్వామి హుండీ ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నట్లు దేవాదాయశాఖ ఈఓ నరసింహరాజు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో శుక్రవారం 'భక్తరహళ్లి నారసంహుడికి పంగనామం' అనే శీర్షికతో పచురితమైన వార్తా కథనంపై దేవాదాయశాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. నరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం, ఖర్చుల వివరాలు పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని ఈఓను ఆదేశించారు.

ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

పరిగి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ హసీనాసుల్తానా ఆధ్వర్యంలో శనివారం ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన వీధులగుండా ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలన్నారు. మండల వ్యాప్తంగా 24తేదీన పాఠశాలల్లో బీఎల్‌ఓ అధికారులు అందుబాటులో ఉంటారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లక్ష్మీదేవి, హెచ్‌ఎం కృపాసత్యరాజ్, ఆర్ఐ సిద్దేశ్, పంచాయతీ కార్యదర్శి నారాయణ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై వినతి

హిందూపురం అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇన్‌చార్జి పీడీ వరలక్ష్మికి వినతి అందించారు. ఆ సంస్థకు నూతనంగా ఎంపికైన ప్రాజెక్టు కార్యదర్శి శోభారాణి, అధ్యక్షురాలు అరుణలు పీడీని కలిసి సమస్యలతో కూడుకున్న వినతిని అందించారు. సెంటర్లకు తర్కారీ, పప్పు దినుసులకు రావాల్సిన బిల్లులు, గ్యాస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీంతో కార్యకర్తలు అప్పులు చేసి సెంటర్లను నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోశాధికారి శశికళ, ఉపాధ్యక్షురాలు మంజుల, సహాయకార్యదర్శి అనిత తదితరులు ఉన్నారు.

గోవును పూజిస్తే దేవతలను పూజించినట్టే

హిందూపురం అర్బన్, నవంబరు23(ఆంధ్రజ్యోతి): గోవును పూజిస్తే ముక్కోటి దేవతలను పూజించినట్లేనని యోగినారాయణ సేవా సమితి పురం శాఖ అధ్యక్షుడు రవిశంకర్ పేర్కొన్నాడు. ఈ విషయం హిందూపురాణాల్లో కూడా ఉందని, అందుకే హిందువులు గోవును దేవతగా పూజిస్తారన్నారు. ఈ సందర్భంగా ఆదివారం కిరికెర ఐటి కాలనీలో గోపూజను నిర్వహించనున్నారని తెలిపారు. కిరికెర అభయ ఆంజనేయస్వామి దేవాలయం వద్ద నుంచి వినాయక దేవస్థానం వరకు సద్గురు శ్రీ కైవారం తాతయ్య చిత్రపటంతో ఊరేగింపు ఉంటుందన్నారు. అదే విధంగా ఉదయం 10 గంటల నుంచి11 గంటల వరకు గోపూజ, 2 గంటలకు అన్నదానం, అనంతరం తాతయ్య నగర సంకీర్తన, నారాయణ సేవ ఉంటుందన్నారు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దోషులను శిక్షించాలి

పెనుకొండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) :విశాఖ లా విద్యార్థినిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థిని అత్యాచార ఘటనను నిరసిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్షకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను అత్యాచారాలను అరికట్టాలని, మహిళా రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కమిషనర్‌ను నిలదీసిన ఇస్లాపురం గ్రామస్థులు

పెనుకొండ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ఇలాగే ఉంటే గ్రామంలో ఎన్నో ప్రాణాలు పోతాయని వెంటనే గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని నగర పంచాయతీ కమిషనర్ శ్రీనివాసులును ఇస్లాపురం గ్రామస్థులు నిలదీశారు. శనివారం రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన అఖిల్ అనే విద్యార్థి బస్సుకిందపడి మృతిచెందిన సంగతి తెలిసిందే. మునిసిపల్ అధికారులు నాగప్పకుంట వద్ద ఇరువైపులా చెట్లు తొలగిస్తున్నారు. గ్రామస్థులు కమిషనర్‌ను చుట్టుముట్టి రోడ్లు ఇలాగే ఉంటే మా ప్రాణాలు పోతాయని వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థులకు హామీ ఇవ్వడంతో శాంతించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

మడకశిర రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు వెంటేశ్ గుప్త తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఈ మేరకు కమిషనర్ రంగస్వామికి వినతి పత్రాన్ని అందజేశామన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 11 వార్డు ముత్యాలమ్మ వీధిలో గత 16 రోజులుగా తాగునీటి సరఫరాలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

నేడు కార్తిక వనభోజనాలు

గోరంట్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎముకలగుట్లపల్లి సమీపంలోని మినీ తిమ్మమ్మ మర్రిమాను వద్ద కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు గోరంట్ల బలిజ సంఘం నాయకుల శనివారం ఓప్రకటనలో తెలిపారు. బలిజలు కుటుంబ సమేతంగా హాజరు కావాలన్నారు.



ఉదయ హిమరాగం

తొలి సంధ్య వేళలో
మంచుదుప్పటిలో ఒదిగిన
ప్రకృతి కాంత
నులివెచ్చని భానుడి కిరణ
స్పర్శ కోసం
'ఉదయ'రాగం ఆలపిస్తోంది.
ముత్యాల సరాల్లా మారిన
మంచు బిందువులు
శీతాకాలపు'స్నో'యగాన్ని
ప్రతిబింబిస్తున్నాయి.
తుహినధారల్లో తడిసిన ధరణి
'మోహన'గీతం పాడుతోంది.

రోడ్డును కమ్మేసిన పొగమంచు



పొగమంచును ఛేదిస్తున్న ఉషోదయ కిరణాలు





విద్యుత్ టవర్‌పై వెలిగే దీపంలా సూర్యుడు

గోరంట్ల, నవంబరు23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శిరగమవాండ్లపల్లి సమీపంలో శనివారం ఉదయం 6.30గంటల సమయంలో సూర్యోదయం ప్రకృతి అందాలతో కనువిందు చేసింది. రహదారిపై వాహనాలు కనిపించకుండా పొగమంచు కమ్మేసింది. విద్యుత్ టవర్‌పై విద్యుత్ దీపకాంతులు విరజిమ్ముతున్నట్లు సూర్యభగవానుడు దర్శనమిచ్చాడు. ఉషోదయ దృశ్యాలు చూపరులను అబ్బురపరిచాయి.

పురం శాంతి భద్రతల్లో రాజీ పడొద్దు

● పోలీస్ అధికారులతో ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): హిందూపురం నియోజకవర్గంలో శాంతి భద్రతల విషయంలో రాజీ పడకూడదని పోలీస్ అధికారులకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే హిందూపురానికి విచ్చేసిన సందర్భంగా ఆయన నివాసంలో డీఎస్పీ, సీఐలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో మట్కా. పేకాట, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని ఉపేక్షించరాదన్నారు. వీటితో పాటు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవారు, వేధించేవారిపట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. హిందూపురం ప్రశాంతంగా ఉండటానికి ఎలాంటి చర్యలు తీసుకున్నా సహకరిస్తామన్నారు. అలాంటి వారిలో సొంత పార్టీవారు ఉన్నా వదిలే ప్రసక్తేలేదన్నారు. డీఎస్పీ మహేష్ మాట్లాడుతూ పట్టణంలో నేరాలు తగ్గంచడానికి కొన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ముఖ్యంగా రాత్రి 10గంటలకు అన్నిషాపులు మూసివేయిస్తున్నామన్నారు. గంజాయి నియంత్రణపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తూ విక్రయదారులను అరెస్టు చేశామన్నారు. కార్యక్రమంలో సీఐలు రాజగోపాల్‌నాయుడు, అబ్దుల్ కరీమ్, జనార్ధన్‌లు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధి పై కమిషనర్‌తో సమీక్ష

హిందూపురం పట్టణ అభివృద్ధిపై మునిసిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులుతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. పట్టణంలో రైల్వేరోడ్డు విస్తరణకు తీసుకున్న చర్యలపై ఆరాతీశారు. డిఎల్ రోడ్డు, ఫైర్ స్టేషన్‌రోడ్డు విస్తరణపై కూడా చర్చించారు, త్వరలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, అంతర్గతంగా ఉన్న పాత పైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్ ఏర్పాటుతో పాటు విద్యుత్ స్థంభాల ఏర్పాటుకు రూ. 250 కోట్లు వస్తాయని పనులు త్వరితగతిన చేయించాలని సూచించారు. మునిసిపల్ కౌన్సిలర్‌లతో కూడా సమావేశం నిర్వహించారు.



రహదారుల విస్తరణపై మ్యాప్ చూపుతున్న మునిసిపల్ కమిషనర్

ఘనంగా సత్యసాయిబాబా జయంతి



పెనుకొండ అల్విన్‌కాలనీలో



పావగడలో ...



ఎం.కొత్తపల్లి పాఠశాలలో

పెనుకొండ/సోమందేపల్లి/ పావగడ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : సత్యసాయిబాబా 99వ జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని పెనుకొండ అల్విన్‌కాలనీలోజూట సత్యసాయి మందిరంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం సత్యసాయి చిత్రపటాన్ని రథంపై ఉంచి వివిధ పూలతో అలంకరించి మంగళవాయిద్యాలు, డ్రమ్ములు,భజనలతో పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం మందిరంలో భక్తులకు ప్రసాద వినియోగం గావించారు. ఎం.కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సత్యసాయిబాబా చిత్రపటానికి పూజలు చేసి, ఉపాధ్యాయులు, విద్యార్థులు జయంతిని జరుపుకున్నారు. బూదిలి గ్రామంలోని వేణుగోపాలాచారి, మీనాక్షి దంపతులు అనవాయితీ ప్రకారం జయంతి జరిపి, అన్నదానం చేశారు. పావగడ హనుమాన్ జువెలరీ జువెలరీ వ్యవస్థాపకులు నటరాజ్ దంపతులు నిర్వహించిన ఈజన్మదిన కార్యక్రమంలో అనేక మంది పట్టణ వాసులు పాల్గొన్నారు.

కారు, ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడి మృతి

మడకశిర రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) మండలంలోని తడకలపల్లి గ్రామ సమీపంలో హైవేలో కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు అందించిన వివరాల మేరకు వృద్ధుడు ద్విచక్రవాహనంలో ఎల్లోటి గ్రామం రోడ్డు నుంచి ప్రధాన హైవే రోడ్డులోకి వచ్చారు.హైవే రోడ్డులో వెనుక నుంచి వచ్చిన కారు ఆయనను ఢీ కొనడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. బచ్చల్యపాళ్యం గ్రామానికి చెందిన సంజీవరెడ్డి కుమారుడు కొత్త కారు తీసుకుని పూజ చేయించుకోవడానికి హిందూపురం వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు ఏ గ్రామానికి చెందిన వ్యక్తి అని వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కారును స్టేషన్ వద్ద ఉంచినట్లు తెలిపారు.



మృతిచెందిన వృద్ధుడు

యువకుడి ఆత్మహత్య

మడకశిర రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైజీపీ తాండాకు చెందిన సుబ్బునాయక్ (26) శనివారం ఇంటి సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి చెల్లెలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొంకల్లు చేపల చెరువు వేలం

గుడిబండ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకల్లు చేపల చెరువును వేలం వేసినట్లు పంచాయతీ కార్యదర్శి హరీష్ తెలిపారు. ఈఓఆర్‌డీ నాగరాజునాయక్, సర్పంచు కవితమ్మ ఆధ్వర్యంలో వేలం వేయగా గోవిందరాజులు అనే వ్యక్తి రూ.2.15లక్షలకు వేలంపాట పాడి దక్కించుకొన్నట్లు వారు తెలిపారు. అలాగేసోమవారం రాళ్లపల్లి చేపల చెరువును వేలం వేయనున్నట్లు తెలిపారు.

పాలల్లో కోత నిజమే: పీడీ

హిందూపురం అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఇటీవల హిందూపురం ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలలో పాల సరఫరాదారు కోత విధించిన విషయం వాస్తవమేనని స్త్రీ, శిశుసంక్షేమశాఖ ఇన్‌చార్జి పీడీ వరలక్ష్మి పేర్కొన్నారు. ఈ నెల 19వ తేదీన ఆంధ్రజ్యోతి దిన పత్రికలో వెలువడిన 'పాల రాక్షసులు' అనే శీర్షికన వెలువడిన కథనంపై సత్యసాయి జిల్లా జేసి అభిషేక్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. విచారణ చేపట్టాలని పీడీని ఆదేశించారు. ఈ విషయంపై శనివారం ఆమె పురంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో విచారణ చేపట్టారు. అదే విధంగా కార్యకర్తలను సీడీపీఓ కార్యాలయానికి పిలిపించి రికార్డులను పరిశీలించారు. ఆంధ్రజ్యోతి కథనంలో పేర్కొన్న విధంగా పాలు అందించడంలో కోత పడిందన్నారు. ప్రతి కేంద్రానికి ఒక బాక్సు పాలు తగ్గించి ఇచ్చారన్నారు.

వర్కర్ నుంచి సీడీపీఓ వరకు ఉదాశీనమే

ట్రాన్స్‌పోర్టర్ పాలను తక్కువ ఇస్తే వర్కర్ సంతకం చేయకుండా ఉండాల్సింది. అయితే సరఫరాదారుడు సీడీపీఓ చెప్పారని చెప్పడంతో ఉన్నతాధికారి చెప్పినా తీసుకోకపోతే ఇబ్బందని భయపడి వర్కర్‌లు సరఫరాదారుడు ఇచ్చిన విధంగా తీసుకున్నారు. అదే విధంగా ఈ విష యాన్ని వర్కర్‌లు సూపర్‌వైజర్లకు తెలియజేశారని వారు సీడీపీఓకు వివరించారన్నారు. అయితే బిల్లు పంపే సమయంలో తక్కువగా రాసి పంపి ఉండాల్సిందన్నారు. అందరి ఉదాశీనతతో సరఫరాదారుడు కోత పెట్టడం మొదలు పెట్టారన్నారు. ఇలాంటి పొరపాటు మరోమారు జరుగకుండా చూడాలని అందరిని గట్టిగా హెచ్చరించారు.



రికార్డులను పరిశీలిస్తున్న పీడీ వరలక్ష్మి

సరఫరాదారుడిని మారుస్తాం: పీడీ

కొత్త ప్రభుత్వ వచ్చిన తరువాత అంగన్‌వాడీ కేంద్రాలకు పాల సరఫరా కాంట్రాక్ట్‌ను కొత్త వారికి కేటాయించారు. పాలను తక్కువ అందించడంతో వారిని మారుస్తున్నామని పీడీ పేర్కొన్నారు. త్వరలో కొత్తవారు పాలు సరఫరా చేస్తారని వివరించారు. అదే విధంగా ఏ ఏ కేంద్రాలకు ఎన్ని బాక్సులు తగ్గించి సరఫరా చేశారో అన్ని పాలను రికవరీ చేసి అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎంపీ పార్థసారథికి సన్మానం



ఎంపీ పార్థసారథిని సన్మానిస్తున్న ఎంపీఈఓలు

అనంతపురం అర్బన్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి) : హిందూపురం ఎంపీ బీకే పార్థసారథిని వ్యవసాయ శాఖ ఎంపీఈఓల సంఘం రాయలసీమ జోన్ అధ్యక్షుడు రెడ్డి ప్రసాద్, ఎంపీఈఓలు ఘనంగా సన్మానించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓడీపై పనిచేస్తున్న తమ సమస్యలపై స్పందించిన ఎంపీ బీకే రాష్ట్ర ఉన్నతాధికారులతో చర్చించి, తమను తిరిగి జిల్లాకు రప్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతపురం నగరంలోని ఎంపీ నివాసంలో శనివారం ఆయనకు శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓల సంఘం నాయకులు నరేష్‌బాబు, భాస్కర్‌నాయక్, రమేష్ పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ బీకే పార్థసారథిని రొద్దం మండలంలోని ఆర్.మరువపల్లిలో ఆయన స్వగృహంలో టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకటగిరిపాళ్యం మాజీ ఎంపీపీ కేశవయ్యకు రాష్ట్ర టీడీపీ పార్టీ యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన సందర్భంగా టీడీపీ నాయకులుఆర్.మరువపల్లి గ్రామానికి చేరుకుని ఎంపీకి పూలమాలలువేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు లక్ష్మీనారాయణరెడ్డి, వీజీపాళ్యంశీన,రమేష్‌నాయుడు ఉన్నారు.

ఎమ్మెల్యే బాలకృష్ణకు ఘన స్వాగతం



ఎమ్మెల్యే బాలకృష్ణకి స్వాగతం పలుకుతున్ననేతలు

చిలమత్తూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహ కార్యక్రమంలో పాల్గొనడానికి హిందూపురం వస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణకు శనివారం సాయంత్రం బాగేపల్లి టోల్‌గేట్ సమీపంలో ఘన స్వాగతం లభించింది. ఆయన బెంగళూరు నుంచి రోడ్డు మార్గాన వస్తుండగా టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకొని ఘనస్వాగతం పలికారు. అభిమానులు, కార్యకర్తలు జై బాలయ్య అంటూ నినాదాలు చేశారు. అనంతరం గజమాలతో ఆయనను సత్కరించారు. అనంతరం కాన్వాయ్‌తో హిందూపురం బయలుదేరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, కన్వీనర్ రంగారెడ్డి, సోమశేఖర్, నందీషప్ప తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు కుమారుని వివాహానికి హాజరైన బాలయ్య



నూతన వధువరులను ఆశీర్వదిస్తున్న బాలకృష్ణ

హిందూపురం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండల టీడీపీ కన్వీనర్ అశ్వర్థనారాయణరెడ్డి కుమారుడి వివాహానికి ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ హాజరయ్యారు. బెంగళూరురోడ్డులోని కల్యాణ మంటపంలో శనివారం రాత్రి జరిగిన వివాహానికి హాజరై శ్రీకాంత్‌రెడ్డి, అనూష నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా హిందూపురం మండల టీడీపీ నాయకులు కల్యాణమంటపం వద్ద బాలయ్యకు స్వాగతం పలికారు. టీడీపీనాయకులు, పలువురు అధికారులు హాజరయ్యారు.

కళాశాల తనిఖీ

పరిగి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎంఈఓ లక్ష్మీదేవి శనివారం విద్యానిధి జూనియర్ కళాశాలను తనిఖీ చేసి అపార్‌ను త్వరగా పూర్తిచేయాలని కళాశాల యాజమాన్యం ప్రిన్సిపాల్ యల్లారెడ్డికి సూచించారు. అనంతరం కళాశాలలో రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాస్టల్‌ను పరిశీలించారు.